క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఇంజేడు శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు హారతిస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరిస్వామి, శ్రీ అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు వేకువజామున్నే ప్రత్యేక అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మహాసభలను జయప్రదం చేయండి

గోస్పాడు: ఒంగోలులో ఈనెల 20 నుంచి 25 తేదీ వరకు జరిగే సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ గోస్పాడు మండల నాయకులు హరినాథ్, జిలాన్‌బాషా కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు వారు శనివారం గోస్పాడులో విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు మౌలా, నరసింహ, నాగరాజు, వెంకటేశ్వర్లు, గౌతమ్, ఆశిన్ బాషా, చిన్న కమ్మగిరి, కార్తీక్, రవి తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న జీవితం స్ఫూర్తిదాయకం



గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పోలీసులు

నంద్యాల: జాతీయ స్వాతంత్ర్యోద్యమ యోధుడు, ఆంధ్ర రైతు ఉద్యమ రథసారథి డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జీవితం స్ఫూర్తిదాయకమని పోలీసుశాఖ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు మోహన్ రెడ్డి, సూర్య మౌళీలు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం కాక, రైతు-కూలీల సంక్షేమం కోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి గౌతు లచ్చన్న అని కొనియాడారు. కార్యక్రమంలో పోలీసు ఇన్‌స్పెక్టర్లు లక్ష్మయ్య, మంజునాథ్, సురేష్ బాబు, రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్లు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు వాజ్‌పేయి


వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం)/నంద్యాల అర్బన్: మాజీ ప్రధాని, స్వర్గీయ వాజ్‌పేయి జీవితం రాజకీయ నాయకులకు ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజకీయ నాయకుడిగా కవిగా, రచయితగా, వక్తగా దేశ చరిత్రలో తనదైన ముద్ర వేసుకున్న అసాధారణ వ్యక్తి వాజ్‌పేయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేడా మురళీధర్, సుధాకర్, చాందిని, భరత్, చంద్రశేఖర్, రవికుమార్ పాల్గొన్నారు.

- ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలు అందించిన వాజ్‌పేయి రాజకీయ రంగంలో ఆదర్శనేత అని భారతీయ కిసాన్ మోర్చ గౌరవాధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి కొనియాడారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి ఆదర్శవంతమైన పాలనను అందించిన నేతగా వాజ్‌పేయికి పేరుందన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్రగౌడ్, నరేంద్రకుమార్ రెడ్డి, సుదర్శన్, పరమేశ్వరయ్య పాల్గొన్నారు.

తూడిచెర్ల కాల్వకు 600 క్యూసెక్కుల విడుదల

జూపాడుబంగ్లా: వర్షాల వల్ల కేసీ కాల్వకు సాగునీటి సరఫరా తగ్గించగా.. వర్షాలు తగ్గు ముఖం పట్టడంతో కేసీ కాల్వకు సాగునీటి సరఫరా పెంచినట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,100 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లాకు 1,400 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. ఈ నీటిని తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 600 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 580 క్యూసెక్కులు, ఏబీ ఆర్ కాల్వకు 20 క్యూసెక్కుల ప్రకారం విడుదల చేస్తున్నట్లు వివరించారు.

కృష్ణం వందే జగద్గురు

- ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు


పద్మావతినగర్‌లో ప్రత్యేక అలంకారంలో కృష్ణుడు


గోస్పాడులోని వేణుగోపాలస్వామి దేవాలయంలో..


బొమ్మలసత్రం ఆలయంలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న భక్తులు


శ్రీనివాస సెంటర్ శ్రీచైతన్య మహాప్రభు మందిరంలో శ్రీకృష్ణ బలభద్ర, సుభద్రల అలంకరణ

నంద్యాల(వ్యవసాయం): శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఊరూరా ఘనంగా జరిగాయి. ఎక్కడ చూసినా కీర్తనలు, కోలాటాలు, ఉట్టికొట్టడాలు, అలంకరణలతో భక్తి భావం ఉట్టిపడింది. నంద్యాల పట్టణంలోని చిత్తలూరి వీధిలో వెలసిన శ్రీకృష్ణ భజనమందిరంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుడు సుధీంద్రాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి తోసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ నిర్వహించి ప్రత్యేకంగా అలంకరింపజేశారు. అనంతరం సామూహిక తులసి అర్చన నిర్వహించి మహామంగళ హారతులు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించి ఉట్టికొట్టే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక శ్రీనివాసనగర్‌లోని శ్రీచైతన్యమహాప్రభు మూవ్‌మెంట్ కార్యాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణ బలభద్ర, సుభద్రలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.
- పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో తెల్లవారు జామునే శ్రీకృష్ణభగవానుని మూలవిరాట్‌కు పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన వేడుకల్లో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పాల్గొని శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెన్నముద్దను వేలం పాట వేయగా చంద్రశేఖర్‌యాదవ్ అనే భక్తుడు రూ.85వేలకు పాట పాడి దక్కించుకున్నారు.
- అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బీఐ కాలనీ రామాలయంలో శ్రీకృష్ణ బలరాముల దివ్య దర్శనం, భజన కీర్తనలు నిర్వహించారు. సాయంత్రం గౌర హారతి, శ్రీకృష్ణ బలరాముల మహా శంఖాభిషేకం నిర్వహించి మహా మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం ఇస్కాన్ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో భగవద్గీత ప్రవచనం నిర్వహించారు.
- స్థానిక బొమ్మలసత్రం షిర్డీసాయిబాబా ఆలయంలో వెలసిన శ్రీకృష్ణ భగవానుడికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నపిల్లలకు కోలాటం, శ్రీకృష్ణ , గోపికల వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బాలాఅకాడమి పాఠశాలలో చిన్నారులకు శ్రీకృష్ణుడి వేషధారణ పోటీలు, భగవద్గీత పోటీలు నిర్వహించారు.


నంద్యాలలో కోలాటం ఆడుతున్న బాలికలు

శిరివెళ్ల: మండలంలోని యర్రగుంట్ల, జీనేపల్లెలోని ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విమలా పాఠశాల బాలికలు గోపికల వేషధారణలతో కోలాటం ఆడి అలరించారు. ఆలయాల్లో భగవద్గీత పారాయణం, భజనలు, ఆచార్యుల బోధనలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

రుద్రవరం: మండలంలో శనివారం శ్రీకృష్ణజన్మాష్టమిని పురస్కరించుకుని పలు గ్రామాల్లో ఉట్టి కొట్టే ఉత్సవం ఉల్లాసంగా నిర్వహించారు.రుద్రవరంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, భక్తి కీర్తనలు గావించారు. అలాగే హరినగరం సమీపంలో ఇస్కాన్ టెంపుల్ ఆ ధ్వర్యంలో సాయంత్రం ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే పండుగలా సాగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి యువకులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పోటీపడ్డారు.

ఉయ్యాలవాడ : మండలకేంద్రం ఉయ్యాలవాడలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆశ్రమంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక అలంకరణ గావించారు. భక్తులు గీతాపారాయణం చేశారు. భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకృష్ణుడికి ఉయ్యాల పాన్పు సేవ చేపట్టారు. బీసీఎస్సార్ ఎయిడెడ్ పాఠశాల విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆశ్రమ నిర్వాహకులు మహానందిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


శ్రీకృష్ణునికి ఊయల ఊపుతున్న గోపికలు

దొర్నిపాడు: మండలకేంద్రం దొర్నిపాడులోని అంకాలమ్మ ఆలయ సెంటర్‌లో ప్రత్యేకంగా శ్రీకృష్ణుడిని కొలువుంచి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు.

గోస్పాడు: మండల కేంద్రం గోస్పాడులోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో అభిషేకం, అర్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో చిన్నారుల శ్రీకృష్ణ వేషధారణలు ఆకట్టుకున్నాయి. రాత్రి స్వామి ఆలయం వద్ద భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ముక్కమల్ల వేణుగోపాల్‌రెడ్డి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వివేకానందరెడ్డి పాల్గొన్నారు.


బాలా అకాడమీ పాఠశాలలో శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు


నంద్యాల..భజన కార్యక్రమం దృశ్యం


పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి ఫరూక్


నంద్యాల..వేలం పాటలో వెన్నముద్దను దక్కించుకున్న చంద్రశేఖర్‌యాదవ్


హరినగరం ఇస్కాన్ టెంపుల్ వద్ద ఉట్టి ఉత్సవం


శిరివెళ్ల.. భక్తులకు అన్నదానం


దొర్నిపాడులో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు


ఉయ్యాలవాడ.. ఆశ్రమంలో భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం


వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం ఉద్ధృతం చేయనున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శులు భూమిని శ్రీనివాసులు పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో వారు వాల్‌పోస్టర్లు విడుదల చేసి మాట్లాడారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభల్లో ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించేందుకు భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు, మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ, లక్ష్మీదేవి, హసీన్‌సా, పద్మావతి, నాగార్జున, సుబ్బారాయుడు, సరస్వతి, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పంటలు జలమయం

ఉయ్యాలవాడ : గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న జోరు వానకు పంటలు జలమయమయ్యాయి. దీంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నదీ తీరం వెంట ఉన్న ఆర్.జంబులదిన్నె, పెద్దయమ్మనూరు, బోడెమ్మనూరు, మాయలూరు, రూపనగుడి, హరివరం, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, నర్సిపల్లె గ్రామాల్లో 182 హెక్టార్లలో వరి, 385 హెక్టార్లలో మొక్కజొన్న, మినుము 58, పత్తి 45, ఇతర పంటలు 29 హెక్టార్లలో సాగయ్యాయి. వరద నీరు ఆయా పంటల్లో ప్రవహించడంతో ఇంత వరకు మొక్కలు పైకి కనిపించకపోవడంతో పంట దెబ్బతినే అవకాశం ఉందని అన్నదాతలు పేర్కొంటున్నారు. వ్యవసాయాధికారులు నీట మునిగిన పంటలను పరిశీలించి రైతులకు తగు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇదిలా ఉంటే కుందూనదిలో వరద నీటి ప్రవాహం శనివారం కొంత తగ్గింది.


ఆర్. జంబులదిన్నె గ్రామ సమీపంలో చెరువును తలపిస్తున్న వరి పొలాలు

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): పేద బలిజ మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాయల్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ ఉమ్మడి జిల్లా నాయకులు పసుపులేటి జనార్దన్, శ్రీనివాసులు, మల్లికార్జునలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు చదువుకున్న కోర్సులో 80శాతం మార్కులు ఉండాలని, కుల, ఆదాయ, టీసీ, ఆధార్, బ్యాంకు ఖాతాలను సమర్పించాలన్నారు. చివరి తేదీ ఆగస్టు 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9440420389, 9885763763లకు సంప్రదించాలన్నారు.

అన్నదాతకు అండ

నంద్యాల(అర్బన్): అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రభుత్వం రైతులకు అండగా నిలబడిందని ని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలును స్వాగతిస్తూ శనివారం స్థానిక టెక్కె మార్కెట్‌యార్డు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు మంత్రి ఫరూక్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షోభంలోనూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన సాగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ హరిబాబు, తదితరులు ఉన్నారు.

గురురాజ స్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు

నంద్యాల(న్యూటౌన్): స్టేట్ లెవెల్ అకాడమిక్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ 2025 అవార్డును గురురాజ స్కూల్ డైరెక్టర్ షేక్షావలిరెడ్డి అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చీరాల నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ స్టేట్ అపుస్మా అధ్యక్షుడు తులసి విష్ణుప్రసాద్, ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు గురురాజ పాఠశాల చైర్మన్ దస్తగిరిరెడ్డి, కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మౌలాలిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదోతరగతిలో తమ స్కూల్‌విద్యార్థులు వైపీఎస్ నర్సిరెడ్డి 597, తిరుమలేష్‌రెడ్డి 595 మార్కులు సాధించడంతో ఈ అవార్డు దక్కినట్లు వారు తెలిపారు. కాగా అవార్డు అందుకున్న షేక్షావలిరెడ్డిని శనివారం పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.


అవార్డు అందుకున్న షేక్షావలిరెడ్డి

బంగారు హారం బహూకరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన తుగ్గలి నాగేంద్ర కుటుంబ సభ్యులతో కలిసి 100 గ్రాములతో తయారు చేయించిన బంగారు హారాన్ని (కాసులపేరు) సమర్పించారు. శనివారం వారు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో బంగారు హారాన్ని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం .శ్రీనివాసరావుకు అందజేశారు. దీంతో దాతలకు వేదాశీర్వచనంతో స్వామి,అమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేసి సత్కరించారు. వేదపండితులు గంటి రాధాకృష్ణమూర్తి, అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జున ఉన్నారు.

మహానందిలో భక్తుల రద్దీ

మహానంది: శ్రావణ శనివారం సందర్భంగా క్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకొని శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. హైదరాబాద్ నగరానికి చెందిన ప్రతాపరెడ్డి నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.10వేలు, మద్దూరు గ్రామానికి చెందిన అన్నపురెడ్డి కేతంరెడ్డి శాశ్వత కల్యాణానికి రూ.5,116, శాశ్వత అభిషేకానికి రూ.5,116, కల్యాణానికి రూ.10116 విరాళం అందించినట్లు ఆయన సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి తెలిపారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు


గురువులతో పూర్వ విద్యార్థులు

వెలుగోడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 26 ఏళ్ల క్రితం పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం పాఠశాలలో కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా తరలివచ్చారు. రెండున్నర దశాబ్దాల తర్వాత కుటుంబాలతో వచ్చి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సరదాగా గడిపారు. కమిటీ వేసుకొని మిత్రులందరినీ ఇలా కలవడం ఆనందంగా ఉందని, చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని సంకల్పించారు.

గురువులను ఊరేగింపుగా..

నాడు తమకు పాఠాలు నేర్పిన గురువులను స్థానిక మదిన సెంటర్ నుంచి భాజా భజంత్రీలతో, బాణాసంచా పేలుస్తూ, పూలు చల్లుతూ ఊరేగింపుగా పాఠశాల వద్దకు తోడ్కొని వెళ్లారు. సరస్వతి పూజ నిర్వహించి గురువులతో జ్యోతి ప్రజ్వలన చేయించారు. అమరులైన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థుల ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు హుస్సేన్ ,శివకుమార్, చంద్రశేఖర్ రెడ్డి, ఉర్దూ మున్షి గని, రాబర్ట్, రవీంద్రుడు, మహమ్మద్ ఇక్బాల్, ఎం ఈ ఓ బ్రహ్మం నాయక్ ప్రస్తుత ఉపాధ్యాయులు మగ్బుల్ బాషా ,ముజాహిద్ బాషా, శమీఉన్నిసా, సంజీవరాజును సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అక్బర్, మోమిన్ వలి, అబ్దుల్ అజీస్, రవి శంకర్ శర్మ, మహమ్మద్ రఫీ మొహమ్మద్ షఫీ సుల్తాన్ మొహిదీన్ ,మొయినుద్దీన్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'స్త్రీ శక్తి'కి స్పందన కరువు

చాగలమర్రి: కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణానికి మహిళల నుంచి స్పందన కరువైంది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో ప్రయాణం సౌకర్యవంతంగా ఉండకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ప్రారంభించిన రెండో రోజే ఈ పథకం నిరాదరణకు లోను కావడం గమనార్హం. శనివారం ఆళ్లగడ్డ, నంద్యాల నుంచి చాగలమర్రి మీదుగా ప్రొద్దుటూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు స్థానికంగా తిరిగే పల్లెవెలుగు బస్సుల్లో పలు మహిళా సీట్లు ఖాళీగా కనిపించాయి.


ఆళ్లగడ్డ నుంచి ప్రొద్దుటూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో సీట్లు ఖాళీగా ఉన్న దృశ్యం



నంద్యాల జిల్లా చాగలమర్రిలో ప్రొద్దుటూరుకు వెళ్తున్న బస్సులో మహిళల రద్దీ లేని దృశ్యం

వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగంలో ఇద్దరికి చోటు

బొమ్మలసత్రం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శులుగా శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన కె. మధుసుదన్‌రెడ్డి, పాణ్యం నియోజకవర్గానికి చెందిన మిలావత్ కాలునాయక్‌ల నియమితులయ్యారు. ఈమేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది.

బాధిత ఉపాధ్యాయుడికి సాయం

నంద్యాల(న్యూటౌన్): ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న గోస్పాడు మండలం ఎం.చింతకుంట్ల ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు రవికుమార్‌కు యూటీఎఫ్ రూ.30 వేలు సాయం అందించింది. ఆసంఘం ప్యాపిలీ మండల నాయకులు రమేష్‌నాయుడు, లతీఫ్, మదనగోపాల్, వెంకటేశ్వరరావు, అరవింద్‌లు శనివారం రవికుమార్ నివాసానికి వెళ్లి ఈ సాయం అందించారు.


రవికుమార్‌కు సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు